సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



కెవ్వు.. కేక్స్

న్యూఇయర్ వేడుకలకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా కొత్త సంవత్సర వేడుకలను జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 గంటలకు కేకులు కట్ చేసి న్యూఇయర్‌కు స్వాగతం పలుకుతారు. ఇందుకోసం బేకరీ నిర్వాహకులు నోరూరించే వివిధ డిజైన్లలో కేకులు తయారు చేసి రెడీగా ఉంచారు. చాక్లెట్, ఆరెంజ్, ఫ్రూట్స్, పైన్ యాపిల్, వెనీలా, బట్టర్‌స్కాచ్, బ్లాక్ ఫారెస్ట్ ఫ్లేవర్లలో కేకులు బేకరీల్లో అందుబాటులో ఉంచారు. డిస్కౌంట్‌లు ప్రకటిస్తూ అమ్మకాలు జరుపుతున్నారు.

– ఝరాసంగం(జహీరాబాద్)



ఝరాసంగంలో ఓ బేకరీలోని కేకులు

న్యూస్‌రీల్

మల్లన్న జాతరకు వేళాయే..



మల్లన్న దేవుడు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని దేవుని పల్లి శివారు గుట్టపై వెలిసిన మల్లన్న దేవుని జాతర కోసం నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని సర్పంచ్‌లు కమలమ్మ, మన్నె సులోచన, మాజీ సర్పంచ్ వల్లూరి గోపాల్, ఉపసర్పంచ్ రాముజ్యోశి తెలిపారు. అలాగే బండ్ల ప్రదర్శన, బోనాల ఊరేగింపును అట్టహాసంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండోరోజు సోమవారం జాతరను మాసాన్‌పల్లికి తరలిస్తామన్నారు.

క్రీడలకు సంపూర్ణ సహకారం



క్రీడాకారులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు : స్వతహాగా క్రీడాకారుడైన తాను క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్రస్థాయి పదో మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు ఇక్బాల్, కోశాధికారి లక్ష్మి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధన అభ్యసన ఫలితాలపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

సంగారెడ్డి అర్బన్: బోధన అభ్యసన ఫలితాలపై శనివారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొని మండల స్థాయి అధికారులు, ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో అమలవుతున్న అభ్యసన కార్యక్రమాలలో భాగంగా ప్రాథమిక స్థాయిలో ఎఫ్ఎల్ఎన్, ఉన్నత పాఠశాలలో ఉన్నతి లక్ష్య కార్యక్రమాల అమలు తీరుపై చర్చించారు. అన్ని పాఠశాలలో ఎఫ్ఎం ఉన్నతి సోపానాల చార్టులను తప్పక ప్రదర్శించాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా బోధన మూల్యాంకనం ఐదు ప్లస్ వన్ టీచింగ్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ప్రజాపాలన సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న సీఈఓ

వట్‌పల్లి(అందోల్) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. శనివారం సాయిపేటలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణను ఆయన పరిశీలించారు.

వట్‌పల్లి(అందోల్) : ఉత్తమ సేవల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. వట్‌పల్లి ఎంపీడీఓగా విధులు నిర్వహించిన జగదీశ్వర్ స్వచ్ఛంద విరమణ తీసుకున్న సందర్భంగా శనివారం స్థానిక రైతువేదికలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అందోల్ ఆర్డీఓ పాండుతో కలిసి ఆయన పాల్గొన్నారు.

మూడో రోజు.. అదే జోరు

- లక్షకు చేరువలో ప్రజాపాలన అర్జీలు



సదాశివపేటలో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన ప్రజలు

దరఖాస్తుల వివరాలు	
మూడు రోజుల పాటు వచ్చినవి	99,248
మూడో రోజు అందినవి	44,708
రేషన్‌కార్డుల కోసం	8,024

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : అభయహస్తం పథకాల అమలే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల జోరు కొనసాగుతోంది. మూడు రోజుల్లో వచ్చిన దరఖాస్తులు ఏకంగా లక్షకు చేరువలో ఉన్నాయి. మూడోరోజు శనివారం 44,708 దరఖాస్తులు వచ్చాయి. మూడు రోజుల్లో ఆయా సంక్షేమ పథకాల కోసం జిల్లా ప్రజలు మొత్తం 99,248 అర్జీలు పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం విదితమే. అభయ హస్తం గ్యారంటీ పథకాలైన గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, రైతుభరోసా పథకాలకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 121 చోట్ల గ్రామ, వార్డు సభలు జరిగాయి. పెద్ద ఎత్తున ప్రజలు ఈ సభలకు తరలివచ్చి ఆయా పథకాలకు అర్జీలు పెట్టుకున్నారు.

పటాన్‌చెరులో మంత్రి దామోదర..

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం జిల్లాలో పలు చోట్ల జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల్లో జరిగిన వార్డు సభల్లో మంత్రి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ శరత్ కూడా పలు మండలాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రేషన్‌కార్డుల కోసం వేలల్లో..

అభయహస్తం పథకాలకు దరఖాస్తులు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. కానీ ఈ కార్యక్రమంలో రేషన్‌కార్డుల కోసం వేలల్లో దరఖాస్తులు వస్తుండటం గమనార్హం. మూడు రోజుల్లో ఏకంగా 8,026 దరఖాస్తులు రేషన్‌కార్డుల కోసం రావడం గమనార్హం. గత ప్రభుత్వం పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులను జారీ చేయలేదు. మార్పులు, చేర్పులు, కార్డుల్లో పేర్లు తప్పుగా పడిన వాటిని కూడా సరి చేయలేదు. దీంతో కొత్త అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల కోసం కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రకటించడంతో జిల్లా ప్రజలు వేలల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. అలాగే అభయహస్తం పథకాల లబ్ధిదారుల ఎంపికకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్త రేషన్‌కార్డుల కోసం అర్జీలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్య, వైద్యానికి పెద్దపీట

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో జరుగుతున్న ప్రజాపాలన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్యారంటీగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 52 శాతం దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించిందని తెలిపారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

పటాన్‌చెరు/ పటాన్‌చెరు టౌన్: పేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద అందిస్తున్న వైద్య సేవలను రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచామని, అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. శనివారం అమీన్‌పూర్ పట్టణంలోని బంధం కొమ్ము ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ, పటాన్‌చెరు మండలం పోచారం గ్రామపంచాయతీ సమీపంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గతంలో మాదిరిగా ఇందిరమ్మ పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కౌంటర్లను మంత్రి పరిశీలించారు.

మంత్రికి వినతి

పటాన్‌చెరు టౌన్: గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను బీఆర్‌ఎస్ నాయకుల అనుచరులకే కేటాయించారని, పారిశ్రామిక వాడలో అనేక మంది ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని అలాంటి వారికి హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్, మార్కెట్ యార్డులో నిర్మించిన దుకాణ సముదాయాలలో అనేక అవకతవకలు జరిగాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌లు మంత్రిని సత్కరించారు.

ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, పటాన్‌చెరు ఎంపీడీఓ బన్సీలాల్, తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలిత, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గం.. సత్వర పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు



లోక్ అదాలత్ ద్వారా ఒక్కటైన విడిపోయిన జంట

సంగారెడ్డి టౌన్ : జాతీయలోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 11 బెంచీలలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కోర్టులో సింగూర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ నష్టపరిహారంతో పాటు జిల్లావ్యాప్తంగా 13986 కేసులు పరిష్కరించరించినట్లు తెలిపారు. ఐదేళ్ల క్రితం విడిపోయిన అమీన్‌పూర్ మండలం ఇలాపూర్ గ్రామానికి చెందిన తలారి పద్మ, ఆంజనేయులు జంటను రాజీమార్గంలో ఒకటి చేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి సుదర్శన్, మూడో జిల్లా జడ్జి సునీత రవీంద్రరెడ్డి, సీనియర్ సివిల్ జడ్జీ రాధాకృష్ణ చౌహన్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు, డీఆర్‌ఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట (అందోల్) : జోగిపేట మున్సిఫ్ కోర్టు పరిధిలో 874కేసులు పరిష్కారమైనట్లు జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి తెలిపారు. శనివారం కోర్టు ఆవరణలో నేషనల్ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీమార్గం ద్వారా సమయం, డబ్బు వృథా కాదని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి గౌడ్, సీనియర్ న్యాయవాదులు విట్టల్ రెడ్డి, ఎస్.నారాయణరెడ్డి, అల్లే శ్రీకాంత్, ప్రభులు, షంషీర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 240 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.సూరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏజీపీ సలోమాన్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ రాజీమార్గమే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని తెలిపారు. ఖేడ్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న చిన్న విషయాల్లో గొడవలు, ఘర్షణలు పడి కేసులు పెట్టుకొని పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగడం మంచిది కాదన్నారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుంటే నేరాలు తగ్గుతాయని తెలిపారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చపాతీలు చేస్తున్న విద్యార్థులు

- గురుకులంలో వెట్టిచాకిరీ!



చపాతీలు తయారు చేస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయిస్తున్న వీడియోలు శనివారం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయ్యాయి. పాఠశాల కిచెన్‌లో విద్యార్థులతో పనులు చేయిస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. ఈ విషయంపై వైస్ ప్రిన్సిపాల్ ధనరాజ్‌ను వివరణ కోరగా.. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్, వర్క్ చేయిస్తున్నామని సమాధానం ఇచ్చారు. పనులు చేయిస్తున్న విషయం తన దృష్టికి కూడా వచ్చిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి పీపీ రాథోడ్ తెలిపారు.

సవరణలపై స్పష్టతేది?

- రేషన్ కార్డుల్లో మార్పుల కోసం ఎదురుచూపు
- దీనిపై స్పందించని ప్రభుత్వం
- అయోమయంలో లబ్ధిదారులు



మునిపల్లి(అందోల్): కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. అయితే గతంలో జారీ చేసిన కార్డులలో మార్పులు చేర్పుల విషయంలో స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుల నుంచి మరణించిన వారి పేర్లు తొలగించిన గత ప్రభుత్వం.. కొత్తవారి, పెళ్లి చేసుకుని అత్తగారింట్లో అడుగు పెట్టిన వారి పేర్లు నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించిందనే విమర్శలున్నాయి.

సంక్షేమ పథకాలకు దూరం

పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. కొత్త రేషన్ కార్డుల జారీలో అలసత్వం వహించిందనే ఆరోపణలున్నాయి. ఆరేళ్లక్రితం కొన్ని కొత్త కార్డులను జారీ చేసినా.. ఆ తర్వాత వాటి గురించే పట్టించుకోలేదు. ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా రేషన్ కార్డుల ప్రామాణికం చేసింది. అవి లేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో లబ్ధిదారులు

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆ ప్రభుత్వం.. రేషన్ కార్డుల ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని చెబుతుండడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, మార్పులు చేర్పుల విషయంలో ప్రభుత్వం, అధికారులు సరైన స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో కార్డుల వివరాలు	
ఆహార భద్రత	3,68,379
తెల్ల రేషన్	3,41,112
అంత్యోదయ	27,152
అన్నపూర్ణ	115
రేషన్ షాపులు	845

అందని మార్గదర్శకాలు

కొత్తగా పేర్లు నమోదు చేయడం, మార్పులు చేర్పుల కోసం గతంలో పౌరసరఫరాలకు శాఖకు దరఖాస్తులు అందాయి. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వీటిలో కొన్ని పౌర సరఫరాల శాఖ, ఆర్డీఓ, తహసీల్దార్, ఆర్‌ఐల పరిశీలనలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం ఓకే చెప్పినా.. మార్పులు, చేర్పులకు సంబంధించి ఎలాంటి మార్గ దర్శకాలను జారీ చేయలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తారా, లేక కొత్తగా దరఖాస్తులను అందించాలా అనేది ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

దరఖాస్తులో ఆప్షన్



గ్రామసభలో అందించే దరఖాస్తులోనే రేషన్ కార్డుకు అర్హత ఉన్నవారి పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంది. కుటుంబంలో తల్లి పేరుపై ఉన్న రేషన్ కార్డు, ఆధార్ నంబర్ రాస్తే సరిపోతుంది. ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వేరు పడినా, సంతానం ఉన్నా దరఖాస్తు ఫారంలో వేర్వేరుగా ఫారాలలో వారి వివరాలు నమోదు చేస్తే సంబంధిత అధికారులు పరిశీలనకు వచ్చి కార్డు మంజూరు చేస్తారు. – తెన్‌మొళి తహసీల్దార్

శ్రీరాముని అక్షింతలతో శోభాయాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో శనివారం శ్రీరాముని పవిత్ర అక్షింతల శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి ఆలయ పురోహితులు రామారావు శర్మ మాట్లాడారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ గ్రామ సమితి ఆధ్వర్యంలో అయోధ్య రాముని పవిత్ర అక్షింతలు పంపిణీ చేస్తామన్నారు. జనవరి 22వ తేదీన అయోధ్య శ్రీరామ ఆలయ ప్రాణప్రతిష్ఠలో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగన్న, సుధాకర్, అమరేందర్ రెడ్డి, చారి, యువకులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): అయోధ్య రామాలయం నుంచి వచ్చిన స్వామివారి అక్షింతల కలశాలను సోలక్‌పల్లిలో శనివారం ఊరేగించారు. ప్రతీ ఇంటికి అక్షింతలు పంపిణీ చేస్తామని నిర్వాహకులు చెప్పారు.

వైద్య శిబిరం పరిశీలన



పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కోహీర్(జహీరాబాద్): జిల్లా వైద్యాధికారి గాయత్రి దేవి శనివారం సాయంత్రం మండలంలోని దిగ్వాల్ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన సమావేశంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

గజ్వేల్: గజ్వేల్‌లో జనవరి 11 నుంచి 14 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించి పోస్టర్‌ను శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. నాలుగు రోజులపాటు జరిగే పోటీల్లో వెయ్యి మందికిపైగా క్రీడాకారులు, మరో వంద మందికిపైగా రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారులు పాల్గొంటారని ప్రతాప్‌రెడ్డి హరీశ్‌రావుకు వివరించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, కబడ్డీ అసోసియేషన్ మహిళా విభాగం చైర్మన్ రాజ్యలక్ష్మీ, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ చైర్మన్ జుబేర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మల్లఖంబ్ పోటీలకు ఎంపిక


అజయ్


బాబు

సిద్దిపేటరూరల్: రాష్ట్రస్థాయి మల్లఖంబ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాఘవాపూర్ విద్యార్థులు జాతీయ మల్లఖంబ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ వెంకటస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బైతి అజయ్ అండర్ 14 బాలుర విభాగంలో అద్భుత ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినిలో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ మల్లఖంబ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అదే పాఠశాల చెందిన బాబు అండర్ 17 విభాగంలో స్టాండ్ బాయ్‌గా ఎంపికయ్యాడని తెలిపారు. దీంతో పీఈటీ వెంకటస్వామిని, విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజు భార్గవి, ఎంపీపీ శ్రీదేవి రామచంద్రారావు, సర్పంచ్ రమేశ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కనకరాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నేరాలు పెరిగి.. ప్రమాదాలు తగ్గి

2023లో 5,931 కేసులు నమోదు

- గతేడాది కంటే 7 శాతం ఎక్కువ
- అధికంగా దొంగతనాలు, పోక్సో కేసులు
- 26 శాతం అధికంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు, చైన్ స్నాచింగ్‌లు
- భరోసా, స్నేహిత మహిళా సపోర్టు సెంటర్ల ద్వారా బాధితులకు భరోసా

జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోల్చితే ఈ ఏడాది క్రైం రేటు 7 శాతం పెరిగింది. 2023లో 5,931 కేసులు నమోదు కాగా, 2022లో 5,491 కేసులు నమోదయ్యాయి. దొంగతనాలు, పోక్సో కేసులు ఎక్కువగా నమోదు కాగా, గతేడాదితో చూస్తే మర్డర్ కేసులు, రేప్ కేసులు, చైన్ స్నాచింగ్, గంజాయి కేసులు తక్కువగా నమోదయ్యాయి. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసి, జరిమానా, మరికొంత మందికి జైలు శిక్ష సైతం విధించారు. అదే విధంగా పోలీసు కమిషనరేట్ పరిధిలో 18 ఏళ్లలోపు బాలికలు ఎవరైనా అఘాయిత్యానికి గురైతే వారికి భరోసా సెంటర్, స్నేహిత మహిళా సపోర్టు సెంటర్ ద్వారా భరోసా కల్పించారు.

- సిద్దిపేటకమాన్

జిల్లాలో మూడు షీ టీం బృందాల ద్వారా ఆకతాయిల ఆటకట్టిస్తూ బాలికలకు, మహిళలకు అండగా నిలిచారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి కేపీఐ అవార్డులు అందించి ఉన్నతాధికారులు అభినందించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాగేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమష్టిగా కష్టపడి విధులు నిర్వహించి సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేశారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల్లో నేరస్తులకు 47 శాతం శిక్ష విధించినట్లు, మూడు కేసుల్లో నలుగురు నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు వెల్లడించారు.



670 దొంగతనాలు

కమిషనరేట్‌లో ఈ ఏడాది 670 దొంగతనాల కేసులు నమోదు అయ్యాయి. రూ.3,73,85,833 సొత్తు దొంగిలించగా వీటిలో 43 శాతం రికవరీ చేశారు. 2022లో 580 కేసులు నమోదు కాగా రూ.3,45,53,298 సొత్తు ఎత్తుకెళ్లారు. ఇందులో 52.95 శాతం రికవరీ చేశారు. అదే విధంగా 2023లో 89 పోక్సో కేసులు నమోదు కాగా గతేడాది 75 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 13 మర్డర్ కేసులు నమోదు కాగా, గతేడాది 19 కేసులు నమోదయ్యాయి. అదే విధంగా జిల్లాలో ఈ ఏడాది 73 రేప్ కేసులు నమోదయ్యాయి. 2023లో 5 చైన్ స్నాచింగ్‌లు, 2022లో 13 చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి.

9,713 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

జిల్లాలో ఈ ఏడాది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై 9,713 కేసులు నమోదు చేసి రూ.93,72,900 జరిమానా విధించి, 28 మందికి జైలు శిక్ష విధించారు. గతేడాది 7,154 కేసులకు రూ.96,77,452 జరిమానా విధించారు. 64 మందికి జైలు శిక్ష పడింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 26 శాతం అధికంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

జరిమానాలు, కేసులు

★ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికల కోసం 2,944బైండోవర్ కేసులు నమోదు చేసి, 2,983మందిని బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఐదుగురిపై జరిమానా విధించారు.

★ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించిన వారిపై 47 కేసులు నమోదు చేయగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,78,50,356 సీజ్ చేశారు.

★ పేకాట ఆడుతున్న వారిపై 26 కేసులు, 162 మందిని అరెస్ట్ చేసి రూ.8,51,895 సీజ్ చేశారు.

★ కమిషనరేట్ పరిధిలో 8,225 ఈ పెట్టి కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై 4,922 కేసులు నమోదు చేశారు.

★ జిల్లాలోని 499 గ్రామపంచాయతీలు, 5 మున్సిపాలిటీల్లో నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా 7,015 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వీటి ద్వారా వివిధ రకాల 32 కేసులను ఛేదించారు.


జగదేవ్‌పూర్ మండలం మునిగడప వద్ద కాల్వలోకి బోల్తా కొట్టిన కారు (ఫైల్)

గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం



నూతన సంవత్సరంలో జిల్లాలో గంజాయి, డ్రగ్స్, కొకైన్, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మహిళలు, బాలికలకు సంబంధించి, కుటుంబ సమస్యలు వంటి కేసులు ఒకే దగ్గర పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తాం శాంతి భద్రతల పర్యవేక్షణకు నిఘా ఏర్పాటు చేసి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

– అందె శ్రీనివాసరావు, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సిద్దిపేట

ఈ ఏడాది జరిగిన కొన్ని ఘటనలు

★ జనవరి10న వేములవాడ రాజన్న దర్శనం చేసుకొని తిరుగి వస్తుండగా సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మునిగడప వద్ద కాల్వలో కారు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురు మృత్యువాత పడ్డారు.

★ సెప్టెంబర్ 12న ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థులు కరీంనగర్‌లో పరీక్ష రాసి తిరిగి మిత్రులతో కలిసి క్వాలీస్‌లో సిద్దిపేటకు వస్తున్నారు. అనంతసాగర్ వద్ద ఆగి ఉన్న లారీని క్వాలీస్ ఢీకొని ముగ్గురు బీటెక్ విద్యార్థులు మృతి చెందారు.

★ డిసెంబర్ 10న జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినితోపాటు మరో ముగ్గురు మహిళలు మృత్యువాత పడ్డారు. పత్తి తీయడానికి వెళ్లి తిరిగి ఇంటికి కూలీలతో ఆటోలో వస్తున్న క్రమంలో ఘటన చోటు చేసుకుంది.

★ డిసెంబర్ 15న చిన్నకోడూర్ మండలం రామునిపట్ల గ్రామంలో కలెక్టర్ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ నరేశ్ ఆర్థిక సమస్యలతో భార్య, ఇద్దరు పిల్లలను పిస్టల్‌తో కాల్చి చంపి.. తాను ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లాలో కలకలం రేపడంతో పాటు, చర్చనీయాంశమైంది.


రామునిపట్ల గ్రామంలో విగతజీవులుగా పడి ఉన్న కానిస్టేబుల్ కుటుంబం (ఫైల్)

540 రోడ్డు ప్రమాదాలు, 14 గంజాయి కేసులు

జిల్లాలో 2023లో జరిగిన 540 రోడ్డు ప్రమాదాల్లో 260 మంది మృతిచెందగా, 480 మంది గాయాలపాలయ్యారు. 2022లో 561 రోడ్డు ప్రమాదాలు జరుగగా 272 మంది చనిపోగా, 540 మంది గాయపడ్డారు. ఈ ఏడాది 3.7 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గగా, 4.4 శాతం మరణాల రేటు తగ్గాయి. పోలీసు కమిషనరేట్ పరిధిలో 2023లో 14 గంజాయి కేసులు నమోదు చేసి 27 కేజీలు సీజ్ చేశారు. 2022లో 27 గంజాయి కేసులు నమోదయ్యాయి.


చిన్నకోడూర్ మండలం అనంతసాగర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన వాహనం (ఫైల్)

కేసులు 10.9 శాతం పెరిగాయ్

- 2023లో పెరిగిన క్రైమ్ రేట్
- భారీగా కేసులు నమోదు
- హత్యలు, అత్యాచారాలు ఎక్కువే..
- నేర నియంత్రణపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా


నాందేడ్ హైవేలో శివ్వంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

సంగారెడ్డి: ఈ ఏడాది 2023లో జిల్లా వ్యాప్తంగా పెరిగిన క్రైం రేట్ పెరిగింది. గతేడాదితో పోల్చితే 10.9 శాతం ఎక్కువగా నమోదు అయ్యింది. తీవ్రమైన కేసుల్లో 3.27 శాతం, హత్యల విషయంలో 14. 6 శాతం, అత్యాచారాల విషయంలో 17 శాతం అధికంగా నమోదు అయ్యాయి. రోడ్డు ప్రమాదాల్లో మాత్రం కేవలం ఒక్క శాతమే నమోదు కావడం విశేషం. మరణాల రేటు మాత్రం కాస్త తగ్గుముఖం పట్టింది.

ఏడాది	హత్యలు	జీవిత ఖైదు
2021	61	03
2022	41	07
2023	47	14

జిల్లాలో జరిగిన ముఖ్య ఘటనలు

- పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు మహిళలు దుర్మరణం చెందారు.
- సదాశివపేట మంజీరా బ్యాక్ వాటర్‌లో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురు వ్యక్తులు చనిపోయారు.
- హత్నూర పీఎస్ పరిధిలో లక్షా 74 వేల విలువైన బంగారం అపహరణ చేసి మహిళను చంపారు.
- సంగారెడ్డి రూరల్ పీఎస్ పరిధిలో రెండు బొలెరోలో తరలిస్తున్న 630 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- నవంబర్ నెలలో చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 390 కిలోల గంజాయిని జిల్లా పోలీసులు పట్టుకున్నారు.
- ఇటీవలె డిసెంబర్ 27న అల్ప్రాజోలం తయారు చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 70 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- నాందేడ్ హైవేలో శివ్వంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, కారు నుజ్జు నుజ్జు అయ్యింది.

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు

ఏడాది	తీవ్రమైనవి	సాధారణం	మొత్తం
2021	182	5,459	5,641
2022	183	6,246	6,429
2023	189	6,946	7,135

- మొత్తం 15 రకాల కేసుల్లో 32 మంది వ్యక్తులకు జీవిత ఖైదు పడిందని ఎస్పీ రూపేశ్ వెల్లడించారు.

కేసులు, జరిమానాలు

- 2022లో వాహన తనిఖీల సమయంలో 2,89,244 కేసులు నమోదు చేసి రూ.12,11,68,987 జరిమానా విధించారు. 2023లో 2,44,593 కేసులు నమోదు చేసి, రూ.9,59,53,273 జరిమానా విధించారు.
- 2022లో డ్రంకెన్ డ్రైవ్ కేసులు 6,369 నమోదు కాగా, రూ.69,42,795 జరిమానా విధించారు. 50 మందికి జైలు శిక్ష పడింది. 2023లో 11,404 కేసులు నమోదు కాగా, రూ. 1,15,55,200 జరిమానా విధించారు. 39 మందికి జైలు శిక్ష పడింది.
- 2022లో అదృశ్యం కేసులు 789 నమోదు కాగా, 8,65 వ్యక్తుల్లో 819 మంది ఆచూకీ లభించింది. 2023లో 826 కేసులు నమోదు కాగా, 890 మందికి 780 మంది ఆచూకీ తెలిసింది.

నేరాల నియంత్రణకు చర్యలు



జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాల నివారణపై శ్రద్ధ వహించాం. అవసరం ఉన్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై అవగాహన, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మహిళల రక్షణకు పెద్దపీట వేస్తూ జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్‌లలో షీ టీమ్స్ బృందాలను ఏర్పాటు చేశాం.

– రూపేశ్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ

విద్యుదాఘాతంతో రైతు మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో శనివారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..జంగపల్లి గ్రామానికి చెందిన మిందె రమేశ్ (37) తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయంతోపాటు కౌలు పనులు చేసుకుంటూ భార్య సుమలత, పదేళ్లలోపు ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. శనివారం వ్యవసాయ పొలంలో పనులు చేసుకోవడానికి ఇంటి నుంచి పెద్ద ఇనుప సలాకను తీసుకెళ్లాడు. పొలం గట్టుపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో బోరు బావులకు పైనుంచి సరఫరా అయ్యే త్రీఫేజ్ కరెంటు తీగలు రమేశ్ చేతిలో ఉన్న ఇనుప సలాకకు తగిలాయి. దీంతో కరెంటు షాక్ తగలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న భూంపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.


రమేశ్ (ఫైల్)

అందరికీ ఆరోగ్య 'మస్తు'

వైద్య రంగంలో సిద్దిపేట పురోగతి

- 1,000 పడకల ఆస్పత్రి. బీ ఫార్మసీ కళాశాల ఏర్పాటు
- ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎనలేని కృషి
- వైద్యారోగ్య శాఖ మంత్రి సమయంలో తనదైన మార్క్
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం


సిద్దిపేటలో ఆస్పత్రిని ప్రారంభిస్తున్న హరీశ్ రావు(ఫైల్)

సాక్షి, సిద్దిపేట: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకల సౌకర్యాలు ఏర్పడ్డాయి. దీంతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయి. ఇక్కడి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో వైద్యరంగంలో సిద్దిపేట జిల్లాకు పెద్ద పీట వేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దారు. 1,000 పడకల జనరల్ ఆస్పత్రిని నిర్మించి తనదైన మార్క్‌ను చాటుకున్నారు.

◆ సిద్దిపేట పట్టణంలో అక్టోబర్ 9న సెల్ఫ్ ఆటోమెటిక్ బీపీ చెకప్ మిషన్ కేంద్రాలను ప్రారంభించారు. సిద్దిపేట పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, కలెక్టరేట్, కోమటి చెరువు వద్ద రెండు, మార్కెట్ యార్డులలో ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు బీపీని సొంతంగా చెక్ చేసుకుంటున్నారు.

◆ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఎన్సాన్‌పల్లిలో నిర్మించిన 1,000 పడకల జనరల్ ఆస్పత్రిని అక్టోబర్ 5వ తేదీన అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అత్యవసర, మరింత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లకుండా సిద్దిపేటలో సేవలు అందిస్తున్నారు.

◆ చిన్నకోడూరు మండలం రామంచలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ రంగనాయక బీ ఫార్మసీ కళాశాలను సెప్టెంబర్ 11న అప్పటి మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ సంవత్సరం 60 మంది బీ ఫార్మసీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

◆ జిల్లాలో 108 అంబులెన్స్‌లు 13 ఉండగా మరో ఐదు అంబులెన్స్‌లను మంజూరు చేశారు. కొత్తగా వచ్చిన ఐదు అంబులెన్స్‌లను ఆగస్టు 2న ప్రారంభించారు. దీంతో పలు కొత్త మండలాలకు సైతం 108 అంబులెన్స్‌లు అందుబాటులోకి వచ్చాయి.

◆ బస్తీ దవాఖాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాకు పది మంజూరుకాగా జూలైలో 8 బస్తీ దవాఖానాలు ప్రారంభించారు. పేద ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. మరో రెండు బస్తీ దవాఖానాలు త్వరలో ప్రారంభం కానున్నాయి.

◆ దుబ్బాక, హుస్నాబాద్‌లలో డయాలసిస్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. దుబ్బాక, హుస్నాబాద్‌లలో డయాలసిస్ అందుబాటులో లేనప్పుడు కిడ్నీ వ్యాధిగ్రస్తులు సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్‌లకు వెళ్లేవారు. ఇప్పుడు స్థానికంగా అందుబాటులోకి రావడంతో షెడ్యూల్ ప్రకారం డయాలసిస్ చేయించుకుంటున్నారు.


శ్రీ రంగనాయక బీ ఫార్మసీ కళాశాల

◆ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏప్రిల్ 23న కీమోథెరఫీ సేవలు 4 బెడ్‌లతో ప్రారంభమయ్యాయి. కీమో థెరఫీ కోసం గతంలో హైదరాబాద్‌కు వెళ్లేవారు. సిద్దిపేటలో ఏర్పాటు చేయడంతో 468 మందికి క్యాన్సర్ బాధితులకు ఊరట కలిగింది.

◆ పోలీసులకు రక్త పరీక్షలు రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్ట్‌గా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో జనవరి 4వ తేదీన ప్రారంభించారు. పోలీసుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేశారు. దీర్ఘకాలిక వ్యాధుల బారీన పడిన పోలీసులకు పలు సూచనలు చేశారు. తొగుటపల్లి, గట్లమల్యాల, భూంపల్లిలలో కొత్త పీహెచ్‌సీల నిర్మాణం కొనసాగుతున్నాయి.

అక్రమ మద్యం పట్టివేత


మద్యాన్ని చూపుతున్న పోలీసులు

మునిపల్లి(అందోల్): గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మధుబాబు తెలిపారు. శనివారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ఓ వాహనంలో నలుగురు వ్యక్తులు 46.75 లీటర్ల మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, సిబ్బంది ప్రభాకర్, శ్రీను, పండరి, మాణిక్‌గౌడ్, గాయత్రీ పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లు పెంచాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పటిష్టంగా అమలు చేయడంతోపాటు జిల్లాలో ఆధార్ సెంటర్లను పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. శనివారం సీపీఎం మెదక్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం కేవల్ కిషన్ భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై చుక్క రాములు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలకు సంబంధించి మూడు రోజులుగా గ్రామాల్లో తీసుకుంటున్న దరఖాస్తుల్లో గందరగోళం నెలకొందన్నారు. ఏ అధికారిని అడిగినా పూర్తి విధివిధానాలు వారికే తెలియదు అని చెప్పడం సిగ్గు చేటన్నారు. దీంతో గ్రామాల్లో అనేక మందికి అవగాహన లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. తీసుకున్న దరఖాస్తులు పరిశీలించి ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సమ్మ, మహేందర్ రెడ్డి, మల్లేశం, బస్వరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి నాగరాజు, సంతోష్, సర్దార్, బగయ్య, నాయకులు బలమని, లచ్చాగౌడ్, బాబు, అజయ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న చుక్క రాములు